# తాత్కాలికం

## షేక్ రఫి



క్రేన్ కథోత్సవం – 2006 కథల పోటీలో
ద్వితీయ బహుమతి పొందిన కథ

"నీళ్ళేంటింత చల్లగా ఉన్నాయ్?" ఓ మగ్గు నీళ్ళు శరీరాన్ని తడిపాక యథాలాపంగా అనేసాడతను. అన్న తర్వాత గానీ గుర్తుకు రాలేదతనికి. క్రితం రాత్రే కదూ తండ్రీ కూతుళ్లిద్దర్నీ తను బస్సెక్కించింది.

"ఏమిట్రా?" అడిగిందతని తల్లి. "ఏం లేదు... ఏమీ లేదు..." గొణిగాడు. ఇక ఈరోజు నుంచి ఆమె తిరిగి వచ్చేదాకా మానసికంగా శారీరకంగా బ్రతకడానికి ప్రిపేర్ కావాలి తను. ఆమె కనుక ఉంటే స్నానానికి వేణ్ణీళ్లు పెట్టేది. చన్నీళ్ళ స్నానం అలవాటు లేకపోవడంతో ప్రాణం జివ్వుమంటోంది.

తల తుడుచుకుంటుండగా "స్టవ్ వెలిగించి నీళ్ళు వేడి చేసుకో వచ్చుగా..." అంది తల్లి. ఓ పేషెంట్ ఆమె. ఆమె చెప్పింది నిజమే! కానీ తనకు స్టవ్ ఎలా వెలిగించాలో తెలీదు. ఆ అవసరం తనకెప్పుడూ కలిగించలేదామె. తను అడక్కముందే తనక్కావలసినవన్నీ సిద్ధం చేసేది.

బట్టలు వేసుకొని తామిద్దరి కోసం హోటల్నుంచి టిఫిన్ తీసుకొచ్చాడు. టిఫిన్ ఎక్కడం లేదు. ఆమె చాలా రుచిగా చేస్తుంది. తల్లి తిన్న తర్వాత ఓ ప్లాస్టిక్ దబ్బాలో ఉన్న మాత్రల్ని ఆమె చేతికందించాడతను. వాటిని మింగి నీళ్ళు తాగిందామె. షూ లేసులు కట్టుకుంటుండగా ఫోన్ రింగయింది.

"అక్క చేసుంటుంది చూడరా..."అంది తల్లి. తమ రెండు కుటుంబాలు ఒకే కాలనీలో ఉంటున్నాయి.

"హలో అక్కా..." అన్నాడతను. అవతల్నుంచి నవ్వు. ఆ నవ్వు అతని ముఖాన్ని వెలిగించింది.

"నేనండి...." అందామె.

"అవును... తెలుసు..."అన్నాడతను నవ్వుతూ.

"ఎలా తెలుసు?" కవ్వింపు.

"మరచిపోతే కదా కొత్తగా తెలుసుకోవ డానికి...." చెప్పాడతను.

"అత్తయ్య టిఫిన్ చేసారా? టాబ్లెట్స్ వేసుకున్నారా?"

"అవును"

"మీరు తిన్నారా?"

"తప్పదుగా..." నీరసంగా చెప్పా డతను. మళ్ళీ నవ్విందామె.

"ఇంకెంత? నెలరోజులేగా... వచ్చే స్తాను.... ఓపిక పట్టండి..." అందామె.

"ట్రై చేస్తాను...." చెప్పాడు.

"నా బుజ్జి కదూ... బంగారు కొండ కదూ!" లాలనగా అంది.

ఊ సర్లే... పెట్టేస్తున్నా... ఆఫీసు టైమవుతోంది...." చెప్పాడతను. ఇవతలి కొచ్చాక "ఎవర్రా?" అడిగింది తల్లి.

"నీ కోడలమ్మా" చెప్పాడతను.

* * *

ఆదివారం... ఉదయం పదవుతోంది. అతను పేపరు చదివే కార్యక్రమం పూర్తయింది. ఆమె పుట్టింటికి వెళ్ళి అప్పటికి వారమైంది. ఆ ఇంట్లో బిక్కు బిక్కుమంటూ తల్లీ తనూ ! ఎక్కువ శాతం మంచమ్మీదే గడిపే తల్లికి కొంత వినికిడి సమస్య కూడా ఉంది. ఆఫీసుంటే ఎలాగోలా పగలు గడిచిపోతుంది. సెలవు సమస్యల నెలవా? ఆమె లేకుంటే అతనికేమీ తోచడం లేదు. ఆమె ఇంట్లో ఎంత సందడి? ఎంత హడావుడి? గాజుల గలగల... గిన్నెల మోత... ఘుమఘుమల తిరగ 'మోత'....

తనతో జీవితాన్ని పంచుకోడాని కొచ్చిన ఈ యేడాదిలో ఓ గొప్ప రసమయ జీవన స్రవంతిలో తనని ముంచెత్తి తిరిగి వెళ్లి

## నీటిపంజరం

ఎన్ని వంతుల భూమి
ఎన్ని వంతుల నీరో తెలీదు
మనిషి నీటి మట్టె
మట్టినీరై ప్రవహిస్తున్నాడని మాత్రం తెలుసు

కశ్మలాలూ, కల్మషాలు పెరిగాక
మొత్తం నీటితో కడగందే ఎలా
అభిషేక జలాలూ ఆవిరి చేస్తే
శిలామూర్తి శుభ్రపడేదెలా

మనిషి దేహ పంజరంలో బంధితుడు
సందేహ పంజరాల బాధితుడు
ఒక వర్షమో, ఒక హర్షమో పునీతుడిని
చేయందే
పురుషోత్తముడు అయ్యేదెలా !

అక్వేరియంలో చిలుక
పంజరంలో చేప
మనిషి ఓ చేప చిలుక
భూమి పంజరపు చిలుక
నీటి పంజరపు చేప
నీటి పంజరం పగిలితే
చేప గిలగిల్లాడి ఛస్తుంది
భూమి పంజరం వీడితే
చిలుక ఎగిరిపోతుంది
చేప చిలుక అయిన మనిషి మాత్రం
భూమినీ వదలడు
నీటినీ వదలడు
తనను తనే వదలడు

\- సుధామ

పోయిందామె కెరటంలా. ఇక మూడు వారాలు గడిచేదెలా? ఏడు రోజులకే FRUSTRATION తనని కమ్మేసింది. ఇంతగా తనెందుకు ప్రేమించాడామెని? ఎందుకనింతగా ఆమెపై ఆధారపడ్డాడు?

ఎందుకంటే ఆమె అతని జీవితంలోకి ప్రవేశించకముందు అతని జీవితానికి అర్థం లేదు. అవును. ఇది ముమ్మాటికీ నిజం ! ఆమె అతని జీవితానికి ఓ అర్థాన్నిచ్చింది. అందాన్నిచ్చింది. ఆమె నవ్వు ముఖాన్ని ఓ సారి తన మనోఫలక మ్మీదికి తెచ్చుకున్నాడతను. అతని కలల ప్రపంచాన్ని నిజం చేసిందామె. ప్రతి కలకూ ఓ అర్థముంటుందని కదా ఫ్రాయిడ్ చెప్పింది.

* * *

సాయంత్రం అయిదవుతోంది. ఆఫీసు నుంచి బయటపడ్డాడతను. వెంటనే ఇంటి కెళ్లాలని అనిపించలేదతనికి. అలా జనం మధ్యలో నడవసాగాడు. జనం...జనం.. చుట్టూ జనం... ఎటు చూసినా కనుచూపుమేర దాకా జనమే... కాళ్లకూ చేతులకూ తగుల్తూ ఒకటే జనం...జన విస్ఫోటనం!కానీ ఎవరి ముఖమ్మీద వెతికినా సంతోషపు జాడల్లేవు. ఎవరూ పక్క వారిని పలకరించడం లేదు. తను ప్రమేయం లేకుండా తమకు లభించిన జీవితాల్ని బల వంతంగా లాక్కుంటూ ముందుకు వెళ్తున్నా రందరూ. కంటి నిండుగా కనబడుతున్నా తాగ డానికి పనికిరాని సముద్రం లాంటి జనం...

"మీరంతా ఎక్కడి కెళ్తున్నారు?" అంటూ గట్టిగా అడగాలని పించిందతనికి. అతని హృదయంలో ఒక పెద్ద శూన్యం... నిర్లిప్తత... ఆమె గుర్తొచ్చిందతనికి. ఇప్పుడు తనేం చేస్తుంటుంది? నేటికి రెండు వారాలవు తోంది. నిర్దాక్షిణ్యంగా ఈ జనారణ్యంలో తనని ఒంటరిగా వదిలేసి వెళ్లినందుకు ఆమెపై విపరీత మైన కోపమొచ్చిందతనికి. ఓ చిన్న రాయిని తన బూటు కాలితో విసురుగా తన్నాడతను. ఇంతలో అతని దృష్టి రోడ్డుని క్రాస్ చెయ్యాలని విశ్వప్రయత్నం చేస్తున్న ఓ ముసలివాడిపై పడింది.వాహనాలన్నీ స్పీడుగా వెళ్లిపోతున్నాయి. రెండు నిముషాలు గడిచాయి.ఆ వృద్ధుడు అలాగే నించుని ఉన్నాడు. వెంటనే వెళ్లి ఆ ముసలివాడి

చెయ్యి పట్టుకొని రోడ్ క్రాస్ చేయించాడతను. అతని చేతిని ఆప్యాయంగా నొక్కాడు ముసలి వాడు. జీవకళని కోల్పోతున్న ఆ కళ్లు కృతజ్ఞతని వ్యక్తం చేసాయి. అలా ముందుకెళ్తుండగా ఓ పెద్ద షాపింగ్ కాంప్లెక్స్ మీద ఓ విదేశీ కారు తాలూకు ప్రకటన హోర్డింగు అందరి దృష్టిని ఆకర్షించడం గమనించాడతను. బహుశా దాని క్కారణం ఆ కారుని ఆనుకుని ఫోజ్ ఇస్తున్న అర్ధనగ్న సుందరి అయి ఉండొచ్చు. ఆ రోడ్డున వెళ్లేవాళ్లు, బస్టాప్‌లో నించున్న మగాళ్లంతా వయసుతో నిమిత్తం లేకుండా ఆమె నగ్నత్వాన్ని ఆబగా చూస్తున్నారు. గుటకలు మింగుతున్నారు. HUMAN WEAKENESS.

అసలా విదేశీ కారుకీ ఆమెకూ సంబంధమేంటో ఎంతకీ అర్థం కాలేదతనికి. ఆ రెండిట్లో ఏది అమ్మకానికుందో తెలియ లేదతనికి. అక్కణ్నుంచి కదిలాడతను. ఓ పది నిముషాలు ముందుకు నడిచాక అప్పుడు ఓ చెక్కబండి మీద కూర్చున్న ఓ అవిటి కుష్ఠువాణ్ని అతని భార్య ముందుకు నెట్టుకుంటూ వెళ్తోంది. ఆమెకూ కుష్ఠువ్యాధి ఉంది. అతనేదో చెప్పాడు. ఆమె నవ్వింది. ఆమె నవ్వగానే అతనూ నవ్వాడు. వాళ్లలా ముందుకు వెళ్తూనే ఉన్నారు. సామాజిక జీవన వైరుధ్యాల్ని చీల్చుకుంటూ. ఈ దృశ్యమతణ్ణి అమితంగా ఆకర్షించింది. సంతోషమనేది అందరికీ లభించేది కాదని అతనికి తెలిసింది.

హోటల్స్, జెవెలరీ, రెడీమెడ్ షాపుల మీదుగా వెళ్తున్నాడతను. గుడ్డి వాడయిన తండ్రి చెయ్యి పట్టుకుని ఓ పదేళ్ల అమ్మాయి అందర్నీ యాచిస్తోంది. జేబులోంచి ఓ నాణెం తీసి ఆమె చేతికిచ్చాడతను. ప్రతి మనిషికీ ఓ ఆసరా కావాలి. ఓ ఆత్మీయ హస్తం తోడుండాలి. మనిషి ఒంటరిగా బతకలేదు. ఆ గుడ్డివాడి కూతురు పెళ్లయి ఎటయినా వెళ్లిపోతే అతని పరిస్థితేమి టని కాసేపు ఆలోచించాడతను. మళ్ళీ తనని తాను సముదాయించుకున్నా డతను. అప్పటికి ఎవరో ఒక మనిషి ఆ గుడ్డివాడికి నేస్తమయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. AN INVISIBLE PROCESS OF THE CRE-ATION, మరి కొంచెం ముందుకెళ్లాడతను. నడిరోడ్డు మీద జనమంతా గుంపుగా పోగయి ఉన్నారు. ట్రాఫిక్‌జాం అయింది. వాహన దారులు హారన్లు మోగిస్తున్నారు. ఇంతలో ఓ అంబులెన్స్ వచ్చింది. ఎవరో పేషెంట్‌కు ఎమర్జెన్సీ చికిత్స అవసరం. పెద్దగా హారన్ మ్రోగిస్తున్నాడు అంబులెన్స్ డ్రైవర్. ఆ గుంపు దగ్గరికి వడి వడిగా వెళ్లాడతను. అప్పటికి గొడవ సద్దు మణిగింది. జనంలో కొందరు కొట్టుకుం టున్న ఇద్దర్ని చెరొక వైపు లాగేసారు.

"మనుషుల్లో సహనం లేదు మాష్టారూ... అయిపోయింది... ప్చ్!" నిట్టూర్చాడు ఓ పెద్దమనిషి. ఎందుకిలా జరుగుతోంది? మనిషెం దుకు సహనం కోల్పోతున్నాడు? జీవితంలో వత్తిడి పెరిగింది. సమస్యలు పెరిగాయి. జీవించ డమే ఓ సమస్యయి పోయింది. జీవితంలో సంతోషమనే మాటే లేదా? లేక మనిషి ప్రయత్నించడం లేదా? ఇందాక తను చూసిన కుష్ఠువ్యాధి దంపతులు గుర్తొచ్చారతనికి. వీరికంటే వారి పరిస్థితి ఎంత మాత్రమూ మెరు గైనది కాదు. మరి వారు సంతోషంగా ఎలా ఉండకల్గుతున్నారు? బహుశా వాళ్లు జీవన వైరుధ్యాలేమాత్రం చలింపజెయ్యలేని స్థితప్రజ్ఞులై ఉంటారు.

* * * *

అతను ఇంటికి చేరేసరికి చీకటి పడింది. మంచమ్మీద పడుకుని ఉన్న తల్లినోసారి చూసా డతను. అతణ్ణి చూసిన తల్లి అటు వైపు తిరిగింది. బాత్రూంలో ముఖం కడుక్కుని వచ్చా డతను. అక్క పంపిన క్యారియర్ డైనింగ్ టేబుల్‌పై సిద్ధంగా ఉంది.

"అమ్మా భోం చేసావా?" అడిగాడు. అతని తల్లి జవాబియ్యలేదు.

"కేరియర్ అక్క పంపించిందా?" సంభాషణ పెంచే ఉద్దేశమతనిది.

"నీకు వండి పంపడానికి నౌకర్లెవరూ లేరిక్కడ. రేపట్నుంచి హోటల్లో తిను..." చెప్పిందతని తల్లి.

"క్యారేజ్ పంపమని నేను అడగలేదే?" గొంతు వరకు తన్నుకొచ్చిందతనికీ మాట... కానీ బయటికి రాకుండా ఆపాడు.

"భర్త పిల్లల్తో దాని సంసారం అది చూస్కోడమే ఎక్కువయిపోతుంది..." అంది తల్లి.

"అలాగేనమ్మా... రేపట్నుంచి మనిద్ద రికి హోటల్నుంచి భోజనం తెస్తాను..." చెప్పా డతను.

"నువ్వు తిను హోటల్లో... నాకు పడదు హోటల్ తిండి... ఆ అవసరం కూడా నాకు లేదు. రాజేశ్వరి (అక్క) తెస్తుంది నాకోసం..." అందామె.

"పెళ్లవగానే నేను పరాయివాణ్ణి అయిపోయానా?" అడుగుదామనుకున్నాడు. కానీ అడగలేదతను. ఎప్పట్లాగే మౌనాన్ని ఆశ్ర యించాడు. మళ్లీ అతన్లో శూన్యం ఆవరించింది. జీవనదులే ఎండిపోతే పాపం పక్షుల పరిస్థి తేంటి? ఓ చిరునవ్వు, ఓ స్నేహ హస్తం, ఓ ఆత్మీయ పలకరింపు కోసం తపించి పోతోం దతని అంతరంగం. ఎడారి ఎండలో ఒయా సిస్సు కోసం అలుపెరుగని ప్రయాణమతనిది. ఓ బాటసారి అతను.

అతని తల్లి భోంచేసాక ప్లేటు, గిన్నెలు శుభ్రం చేసాడు. చాపమీద పడుకుని పైన తిరిగే

స్వగృహ ఫుడ్స్
Swagruha® Foods
Opp : P.W.D. Grounds, M.G. Road, VIJAYAWADA - 10
Phone : 2475763, Fax : 0866 - 2480200.
Eluru Road (Canara Bank Building).
Near Vijaya Talkies, Vijayawada - 520 002. Ph : 6626263.
10/2, Arundelpet, Guntur - 522 002. Ph : 2235350.
Visit us : www.swagruhafoods.net

ఫేను వంక అలాగే చూడసాగాడతను. ఒకటి రెండుసార్లు అతని తల్లి దగ్గు వినిపించిందతనికి. మళ్లీ నిశ్శబ్దం ఎప్పట్లాగే. ఏదో పరిమళం అతని ముక్కుపుటాలకు సోకుతుండగా తటాలున లేచి కూర్చున్నాడతను. జడలో సన్నజాజులు తురుము కుని తన పక్కకు చేరే భార్య గుర్తొంచ్చిందతనికి కిటికీలోంచి సన్నజాజిచెట్టు పలకరించిందతణ్ణి. అతనికి సంతోషమనిపించింది. అతడి పెదాల పై చిరునవ్వు వెలిగింది. దానికి జవాబుగా సన్నజాజి కొమ్మ తలూపింది. 'ఈ సృష్టిలో ఎవరూ ఒంటరి కాదు' అనిపించిందతనికి. ఆ భావన అతనికి హాయిని కలిగించింది.

✷ ✷ ✷

ఆ ఉదయమతను 'OLD MAN AND THE SEA' చదువుతుండగా అతని అక్క కొడుకు వచ్చాడు. ఇంజనీరింగ్ చేస్తున్నాడతను. పుస్తకం మూసి "కూర్చోరా" అన్నాడతను. కూర్చోలేదతను. గెడ్డం పెరిగింది. రెండు షర్టు బటన్లు విప్పి చొక్కాని మెడ వెనక్కి లాక్కు న్నాడు. అసహనంగా ఇంట్లో అటూ ఇటూ తిరిగాడు. కాసేపు టి.వి. ఆన్ చేసాడు. ఏ ఛానెలు దగ్గరా ఆగలేదు. టి.వి. ఆఫ్ చేసాడు. ఎందుకితన్లో ఇంత అసహనం? టెన్షన్?

"మహేషూ... టిఫిన్ చేసావా? అమ్మేం చేస్తోంది?" తన తల్లి మంచంలో నుండే ఆప్యా యంగా అడిగింది. ఈమె తనతో ఎందుకలా ప్రేమగా మాట్లాడదు?

'ఎనీ ప్రాబ్లెం?' మహేష్‌ని అడిగాడతను.

"నాకు విసుగొస్తుంది మామయ్య. బోర్....I CAN'T TOLERATE IT FURTHER అమెరికా వెళ్ళిపోతాను" నించునే చెప్పాడు హోండా కీ చెయిన్ తిప్పుతూ.

"ఏముందక్కడ?" అడిగాడతను.

"ఇక్కడేముంది?"ప్రశ్నించాడు మహేష్.

"నీకేం కావాలి?"

"బాగా డబ్బు సంపాదించాలి. కార్లో తిరగాలి..." చెప్పాడు.

"ఇంకా?"

"లైఫ్‌లో ఇక దానికంటే ఎంజాయ్ ఏముంటుంది? హ్యాపీగా సెటిలవ్వచ్చు..."

"డబ్బు, హోదా, కారు... ఇవి మనిషికి సంతోషాన్నిస్తాయా?" అడుగుదామనుకున్నాడతను.

"అలాగే వెళుదువుగాని, ముందు నీ చదువు పూర్తి చేయ్..." అని మాత్రం చెప్పాడతను. మరుక్షణంలో వెళ్లిపోయాడు మహేష్.. మళ్ళీ హెమింగ్‌వే పుస్తకంలో తల దూర్చాడతను.

"THEY WERE STRANGE SHOULDERS, STILL POWERFUL ALTHOUGH VERY OLD AND THE NECK WAS STILL STRONG....."

ఆమె వెళ్లి ఇరవై రోజులయిందప్పటికి. అతని తల్లి సాధింపు ఎక్కువయిందతనికి......

"నా ఆరోగ్యం సంగతి వదిలెయ్... ఇంట్లో చెట్టంత మొగుడికి ఎవరు వండి పెడతారన్న ఇంగిత జ్ఞానం ఉండక్కర్లా...?" ఇక లాభం లేదనుకుని ఆఫీసుకి వెళ్ళబోయే ముందు ఫోన్ చేసాడు.

"సుజీ... ఇంకెన్ని రోజులు? త్వరగా వచ్చెయ్..."

"వచ్చేస్తున్నానండి... ఇంకెంత? అయిదు రోజులే..."

"అయిదు రోజులా?"

"అవును... అత్తయ్యగారెలా ఉన్నారు? మీ అక్కగారెలా ఉన్నారు?"

"అవన్నీ తర్వాత... ముందు నువ్వు వెంటనే రాకపోతే నా పరువు దక్కేలా లేదు..." అన్జెప్పి పెట్టేసాడతను. ఆఫీసు నుండి ఇంటి కొస్తూనే అదే విషయం తల్లితో చెప్పాడతను. ముఖం చిట్లించిందామె ఎప్పట్లాగే.... అయిదు రోజులంటే ఎన్ని గంటలు? లెక్క వేసాడతను. నూట ఇరవై గంటలు. అంటే నూట ఇరవై ఒకటో ఘడియలో తను ఇంట్లో ఉంటుందా? సిల్లీ... ఎవరయినా తనలా గంటలు లెక్క పెడతారా? కావచ్చు! ప్రేమించేవాళ్లు, ఆదరించే వారు, ఆప్యాయంగా పలకరించే వాళ్లు లేకుండా బతకడమనేది చాలా కష్టమైన వ్యవహారంలా అనిపించిందతనికి. టి.వి. ఆన్ చేసాడు. హెచ్.బి.ఓ.లో 'నాటింగ్ హిల్' వస్తోంది. హ్యూ గ్రాంట్, జూలియా రాబర్ట్స్, అతనో సామాన్యుడు..... ఆమె ఓ సెలబ్రిటి. అయినా అతణ్ణి కోరుకుంటుందామె. సామాజికంగా, ఆర్థికంగా ఎంతో ఉన్నత స్థానంలో ఉన్న ఆమెకి ఓ సామాన్యుడిలో నచ్చిన అంశ మేంటి? ప్రేమ! మనిషి హృదయంలో చెలరేగే ఈ అపురూప మైన భావనకు ఏదీ అడ్డు కాదేమో !

"ఆఫీసు నుండి ఇదేనా రావడం?" అక్క రాజేశ్వరి గొంతు విని టీ.వి. ఆఫ్ చేసి నవ్వుతూ లేచి నిలబడ్డాడతను.

"రా.అక్కా...కూర్చో....!"చెప్పాడతను.


"క్యారియర్ పంపుతున్నాను. తింటున్నావా?" అడిగిందామె. అవునంటూ తలూపాడతను.

"అమ్మనెవరు చూస్తార్రా ఈ వయసులో? సుజాతతో కాస్త గట్టిగా మాట్లాడు... ఇలా మెత్తగా ఉంటే ఎలా? భవిష్యత్తులో నీకే కష్టం..."

"వాడి ముఖం..... వాణ్ణి ఎప్పుడో తన కొంగున కట్టేసిందది...." అతని తల్లి నిష్ఠూరపడుతోంది. ఆకాశం మేఘావృతమవుతోంది బయట.

✷ ✷

అతని జీవితంలో



వసంతాల్ని, సంతోషాల్ని నింపడానికి ఆమె వచ్చేసింది. ఆ రాత్రి సన్న జాజులు, కనకాంబరాలు, దవనం కలిపిన మాలని జడలో తురిమిందామె.

"నీకేం...హాయిగా మీ వాళ్ళ మధ్య గడిపొచ్చావ్.... ఒక క్షణం ఒక యుగమైందిక్కడ నా పరిస్థితి..." చెప్పాడతను, చిరుకోపంగా ఆమె నవ్వి.

"మీరు పొరబడుతున్నారు... అందరూ ఉన్నా కూడా ఏదో తెలియని వెలితి నన్ను అనుక్షణం వేధించిందక్కడ..." అందామె.

"నిజంగానా?"అన్నాడతను ఆప్యాయంగా ఆమె చేయి నొక్కుతూ.

"ఆ తర్వాత ఆ వెలితికి కారణమేంటో అర్థమైంది నాకు..." అంది అతనికళ్లలోకి చూస్తూ...

"ఏంటది? అన్నాడతను ఆసక్తిగా...

"నేను మనిషిని మాత్రమే అక్కడకు వెళ్లానని, నా మనసిక్కడే వదిలానని..." అంది. ఆమె మాటలెంతో మధురంగా అనిపించాయతనికి. వారిద్దరి కళ్లూ ఆర్ద్రమవగా

"నన్ను విడచి ఎక్కడికీ వెళ్లకేం... పిచ్చివాణ్ణయిపోతాను నువ్వు లేకపోతే....!" అన్న అతణ్ణి తన గుండెల్లో భద్రంగా దాచుకుందామె.

తాత్కాలిక మబ్బుతెరలు తొలగి పోవడంలో మళ్ళీ ప్రకాశవంతమయ్యాడు చంద్రుడు.


**రిఫ్రిజిరేషన్ మరియు ఎయిర్ కండీషనింగ్ కోర్స్**

రిఫ్రిజిరేటర్, బాటిల్ కూలర్, విండో ఏ.సి.
స్ప్లిట్ ఏ.సి. ప్యాకేజ్ యూనిట్ సెంట్రల్ ప్లాంట్ నందు
అత్యుత్తమ శిక్షణ

15వ తేదీ నుండి క్లాసులు ప్రారంభమగును,
హాస్టల్ వసతి కలదు

ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఎయిర్ కండీషనింగ్ ఇంజనీర్స్

IAC ENGINEERS

డోర్ నెం. 27-12-51, ఆలీబాగ్ స్ట్రీట్
విజయకృష్ణా సూపర్ బజార్ ఎదురు
సందు, విజయవాడ - 2
✆ 0866-2578495
సెల్: 98481 46605


# సర్వజిత్ నామ సంవత్సర ఉగాది సాహిత్య ప్రతిభా పురస్కారాలు

**గత 6 సం॥లుగా ఇస్తున్న ఉగాది సాహిత్య ప్రతిభా పురస్కారాలు ఒక్కొక్క కవి / రచయితకు రు. 1,116/-లు ఈ క్రింది వారికి ఇచ్చుటకు నిర్ణయించాము.**

| | ప్రక్రియ | పురస్కార గ్రహీత |
|---|---|---|
| 1. | పద్యకవిత | శ్రీ జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి (విహారి), |
| 2. | వచన కవిత | శ్రీ శిలా వీర్రాజు, |
| 3. | నానీలు | డా॥ ఎస్. రఘు, |
| 4. | భక్తి రచన | శ్రీ సామవేదం షణ్ముఖ శర్మ, |
| 5. | కథ | శ్రీ దొండపాటి దేవదాసు, |
| 6. | నవల | ఆచార్య ముదిగొండ శివప్రసాద, |
| 7. | సాహిత్య విమర్శ | డా॥ కడియాల రామమోహనరాయ్, |
| 8. | నాటకరంగం | ఆచార్య ఎస్.గంగప్ప, |
| 9. | బాలసాహిత్యం | శ్రీ యం.వి.జి. ఆంజనేయులు, |
| 10. | హాస్యరచన | శ్రీ బులుసు వెంకట కామేశ్వరరావు, |
| 11. | హాస్యనాటికలు | శ్రీ వీర్ల వర ప్రసాద, |
| 12. | జర్నలిజం | శ్రీ తెలకపల్లి రవి, |
| 13. | రచయిత్రికి ప్రత్యేకం కవిత్వం | శ్రీమతి శారదా అశోకవర్ధన్, |
| 14. | ॥ కథ / నవల | శ్రీమతి జె. సుమేధాదేవి, |

ఆయా కవులకు / రచయితలకు నగదు పురస్కారాలు ది.22-4-2007న బందరులో జరుగు సాహిత్య పురస్కార ప్రదానోత్సవ సభలో ఇవ్వబడతాయి. ఆయా కవులు / కవయిత్రులు తమ రచనలను (ఇది వరకు పంపి ఉండకపోతే) బయోడేటాను, 2 పాస్‌పోర్టు సైజు ఫోటోలను క్రింది అడ్రసుకు పంపవలసిందిగా కోరుచున్నాము.

పంపవలసిన చిరునామా :
ఆంధ్ర సారస్వత సమితి
23/247/1, బచ్చుపేట
మచిలీపట్నం - 521 001
ఫోన్ : 98480 30730, 98483 66964